




గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉలవపాడు



ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య

మండలంలోని కరేడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలురు పాఠశాలలో ఈనెల 20 తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపల్ ఎన్ వెంకట సుబ్బయ్య శుక్రవారం తెలిపారు.మొత్తం ఖాళీలు150 సీట్లు,3వతరగతికి 40 సీట్లు ఉండగా ఎస్టీలకు-32, ఎస్సీలకు-05,బిసి-02, ఓసీలకు-01 మాత్రమే. మిగిలిన 110 సీట్లు 4వ తరగతికి ఎస్టీలకు-35 సీట్లు,5వ తరగతి ఎస్టీలకు-30 సీట్లు,6వ తరగతి ఎస్ టి లకు-24,7వ తరగతి ఎస్టీలకు-5,8వ తరగతి ఎస్టీలకు-5,9వ తరగతి ఎస్టీలకు-11 సీట్ల ఖాళీలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు.4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల సంవత్సర ఆదాయం లక్ష రూపాయలు మించరాదు.వివరాలకు కరేడు గిరిజన పాఠశాలను సంప్రదించాలని తెలిపారు.

కుటుంబం ఎలా బతకాలి..!

- నాలుగేళ్ల నుంచి జీతాల్లేవ్..
- రూ.4.68 కోట్ల బకాయిలు
- లస్కర్ల జీవన కష్టాలు

ఒక్క నెల జీతం రాకపోతే ఎవరైనా నానా హైరానపడిపోతారు.. కుటుంబ పోషణ...పిల్లలు స్కూల్ ఫీజులు.. పచారీ ఖర్చులు..కరెంట్ బిల్లులు..ఇంటి అద్దెలు..ఒక్కటేమిటి అన్నింటా ఆర్థిక ఇబ్బందులే..ఒక్క నెల జీతం అందకపోతే తెలిసిన స్నేహితుల వద్ద చేబదులు...వడ్డీలకు అప్పులు...ఇంట, బయట వేధింపులు ఇది సర్వసాధారణమైన అంశం. వారికి ఒకటి, కాదు. రెండు కాదు.. ఏకంగా నాలుగేళ్ల నుంచి జీతాలు అందడం లేదు..వైసిపి ప్రజా ప్రతినిధులు, పెద్దలకు మూడేళ్లు చెప్పారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజా ప్రతినిధులు, నేతలు ఏడాది నుంచి చెబుతూనే ఉన్నారు.. ఇరిగేషన్‌లో నీటి నియంత్రణలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్న లస్కర్లకు జీవన పరిస్థితి ఇది. జిల్లా వ్యాపితంగా అవుట్ సోర్సింగ్ ద్వారా 223 మందికి సుమారు రూ.4.68 కోట్ల జీతాలు బకాయిలున్నాయి. ఇదిగో, అదిగో అంటూ కాలం గడుపుతున్నారు. ఈనెల 5 నుంచి సోమశిల నుంచి నీరు విడుదల చేస్తున్న సమయంలో లస్కర్లకు జీతాలిచ్చి, వారి వద్ద పనిచేయించుకోవాల్సి ఉంది. ఏం చేస్తారో చూడాలి.



కావలి కాలువ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

.ప్రభుత్వం చిన్నచిన్న ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రోజంతా కష్టపడి ప్రజల కోసం పనిచేస్తున్న కార్మికులు, చిన్న ఉద్యోగులు ఇవ్వాల్సిన గౌరవ వేతనం లేదా జీతం ఇవ్వడానికి చేతులు రావడం లేదు. జిల్లాలో 146 టిఎంసిల నీరు లభ్యమవుతోంది. కండలేరు, సోమశిల ప్రాజెక్టుల నుంచి వచ్చే నీరు కనుమూరు కాలువ, కావలి, ఉత్తర, దక్షణ కాలువలు, పెన్నా డెల్టా కింద సుమారు 8లక్షల ఎకరాలుసాగుచేస్తున్నారు. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేసిన సమయంలో కాలువలకు, అక్కడ నుంచి చెరువులకు దగ్గరుండి లస్కర్లు నీటిని విడుదల చేస్తారు. కాలువపై తిరుగుతూ ఎక్కడ ఏ సమస్య ఉన్న ఉన్నతాధికారులకు తెలియజేస్తూ, ఇరిగేషన్‌లో నీటి తీరువా విషయంలో కింద స్థాయి ఉద్యోగులు ఎంతో కీలకంగా ఉన్నారు. జిల్లాలో అతివృష్టి, అనావృష్టి ఎప్పుడు నీరు సరిగా ఉంటుందో తెలీదు. తొలి పంటకు ఎలాగోలా సాగిపోయినా రెండో పంట సాగువిషయంలో అతితక్కువ నీటితో సాగుచేయాల్సి ఉంటుంది. అప్పుడు ఇరిగేషన్ అధికారులు లస్కర్లను సమన్వయం చేసుకొని ఎక్కడా చుక్కనీరు వృథా కాకుండా వ్యవహరిస్తారు. అనేక సందర్భాల్లో వీరి కృషి ఫలితంగా మంచి దిగుబడి వచ్చింది. ఒక టిఎంసి నీరు 9 వేల ఎకరాలకు సరాసరి ఇస్తారు. 2002లో ఏకంగా ఒక టిఎంసితో 14వేల ఎకరాలతో పంట పండించి రికార్డు సృష్టించారు. ప్రభుత్వం, రైతులు, రైతు సంఘాలు, నీటి నిర్వహణ ద్వార ఇది సాధ్యమైంది. అప్పట్లో లస్కర్లు కాలువపై రాత్రి, పగలు తిరిగి నీరు వృథా కాకుండా పంటలు సాగుచేయడానికి దోహదపడ్డారు. ఇరిగేషన్‌లో లస్కర్లు కీలకంగా ఉన్నారు.

నాలుగేళ్ల నుంచి జీతాల్లేవ్..!

ఇరిగేషన్ శాఖ అధ్వర్యంలోని లస్కర్లకు నాలుగేళ్ల నుంచి జీతాలు అందడం లేదు. జిల్లా వ్యాపితంగా 223 మంది పనిచేస్తున్నారు. ప్రతి నెలా ఒక్కో లస్కర్‌కు రూ.10,500 జీతంగా చెల్లిస్తున్నారు. ఒక్క ఏదాదికి వీరి జీతంగా రూ.1.15 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికి నాలుగేళ్ల నుంచి వీరికి రావాల్సిన బకాయిలు రాలేదు. ఇప్పటి వరకు నాలుగు సంవత్సరాలకు కలిసి రూ.4.68 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వైసిపి ప్రభుత్వంలో మూడేళ్ల జీతాలు కోసం ప్రాధేయపడ్డా పని జరగలేదు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా వీరి జీతాలు విడుదల కావడం లేదు. నీటి తీరువా పన్ను వసూళ్లు చేస్తేనే జీతాలు ఇస్తామని గత ప్రభుత్వం పెండింగ్ పట్టింది. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు నీటి పన్ను చెల్లించడం లేదు. నీటి పన్నుకు, జీతాలకు లింకు పెట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వమైనా తమ జీతాలు ఇస్తుందని లస్కర్లు ఎదురుచూస్తున్నారు..

'ఆనం' 'సోమిరెడ్డి'లపైనే ఆశలు..!

ఇరిగేషన్‌లో లస్కర్లకు నాలుగేళ్ల నుంచి జీతాలు రాకపోవడంతో ఇప్పుడు ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపైనే లస్కర్లు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని ఇరిగేషన్ కాలువలు, ఇతర అంశాలపై పట్టున్న నేతలు ఆనం, సోమిరెడ్డి . ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో లస్కర్లు ఈ విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరు నేతలు స్పందించి చిరుద్యోగులు, చిన్న .జీతం కూడా ఇవ్వకపోవడం అన్యాయమని, ఇరిగేషన్ మంత్రి, అవసరమైతే సిఎం వద్దకు వెళ్లి జీతాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇద్దరు సీనియర్ నేతలు ఇచ్చిన హామీతో నేడో, రేపో జీతాలు వస్తాయని లస్కర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి. ఈ నెల 5 నుంచి సోమశిల నుంచి నీటి విడుదల చేయనున్నారు. ప్రభుత్వం లస్కర్లకు జీతాలు చెల్లిస్తేనే ఉపయోగం ఉంటుంది. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఇని వివరణ అడగ్గా 2023 జూన్ నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉందని , ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

'ప్రకాశం' కళాశాల ఫ్యాకల్టీకి పిహెచ్.డి డిగ్రీ

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కలవకురి మోహనరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్.డి డిగ్రీ మంజూరైంది. 2025 ఏప్రిల్ 18న ఆయనకు డిగ్రీ లభించింది."క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో డీప్ లెర్నింగ్ ఆధారితంగా వర్క్‌లోడ్ అంచనా, వనరుల కేటాయింపు నమూనాల పనితీరు మెరుగుదల" అనే అంశంపై క్లౌడ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధన నిర్వహించారు. ఆయన పరిశోధనకు మార్గదర్శకుడిగా డాక్టర్ బొబ్బా బసవేశ్వరరావు పని చేశారు. వైవా పరీక్షను శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ గీతాంజలి నిర్వహించారు.



పరిశోధన ఫలితంగా నాలుగు అంతర్జాతీయ జర్నల్స్‌లో పత్రాలు ప్రచురితమయ్యాయి.కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామయ్య మాట్లాడుతూ, "శ్రమిస్తే సాధ్యమయ్యే లక్ష్యాలకు మోహనరావు బలమైన ఉదాహరణ. ఆయన నిబద్ధత యువ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తుంది" అన్నారు.టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ పరిశోధనను ప్రోత్సహించే వాతావరణాన్ని అందించడమే కాక, ప్రతిభావంతుల అభివృద్ధికి పునాది వేస్తోందని డా. మోహనరావు విజయం అందుకు నిదర్శనం" అన్నారు.ప్రిన్సిపల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "ఈ విజయం కాలేజీ ఖ్యాతిని మరింత పెంచింది" అన్నారు.వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు, "ఇది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే ఘనత" అన్నారు.డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ, పరిశోధనలో మద్దతు అందించిన కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం వ్యక్తిగత అభివృద్ధికే కాక, విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందన్నారు.కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ మోహనరావును అభినందించారు.

పంట కాలువలపై ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి-నెల్లూరు



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

నగర పాలక సంస్థ పరిధిలోని పంట కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన ఆక్రమణలను గుర్తించి పూర్తిగా తొలగించాలని, నీటి పారుదల సాఫీగా జరిగేలా పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం స్థానిక 30వ డివిజన్ పోలీస్ కాలనీ తెలుగు గంగ కాలనీ రెవెన్యూ కాలనీ చంద్రబాబు నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి పారుదలకు అడ్డంకిగా మారిన కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన డ్రైయిను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైయిను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి వేకంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు. నూతన నిర్మాణాలకు సంబంధించి ఇంటి పన్నుల వివరాలను, అసెస్మెంట్ నెంబర్లను తనిఖీ చేసి, కమిషనర్ స్వయంగా భవనాలకు కొలతలు వేసి పరిశీలించారు. స్థానిక డైకాస్ రోడ్డు కూడలిలోని అన్న క్యాంటీన్ కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలలో రోడ్డును ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలన్నింటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని కమిషనర్ సూచించారు. అనంతరం స్థానిక 31వ డివిజన్ అక్కచెరువుపాడు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటుచేసిన లేఅవుట్ స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. లేఅవుట్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ పద్మజ, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

5వ తేదీలోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-కందుకూరు:

.2025 మేలో జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించడానికి ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు ఇంటర్మీడియట్ బోర్డు గడువు పెంచిందని టిఆర్ఆర్ గవర్నమెంటు జూనియర్ కాలేజీ కందుకూరు ప్రిన్సిపల్ షేక్ నాగూర్‌వలి పేర్కొన్నారు. ఇప్పటివరకు ఫీజు చెల్లించలేక పోయిన విద్యార్థుల సౌకర్యం కోసం ఇంటర్మీడియట్ బోర్డు ఈ చివరి అవకాశం కల్పించిందని, అందరు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి వీలైనంతవరకు 5వ తేదీ మధ్యాహ్నం లోగా కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చునని తెలియజేశారు. 5 వ తేదీ తర్వాత గడువు పెంచడం గానీ, అపరాధ రుసుముతో ఫీజు చెల్లించడానికి గానీ, తత్కాల్ ఫీజు అవకాశం కల్పించడం జరగదని తెలిపారు.

పొగాకు రైతన్నను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు



పొగాకు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ బుర్రా

కందుకూరు నియోజకవర్గం లోని పొగాకు సాగు చేసిన రైతులు పక్షాన ఎంతవరకైనా వైసిపి నిలబడుతుందని మాజీ శాసనసభ్యులు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు.రైతు పండించిన పొగాకు పంటకు సరైన మద్దతు ధర కల్పించాలని కోరుతూ శుక్రవారం పొగాకు బోర్డు 27 లోని వేలం కేంద్రం రెండులో వేలం తీరును పరిశీలించారు.గత సీజన్లో అత్యధిక రేటు పలికిన పొగాకు పంట కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వలన కనీస మద్దతు ధర నేడు పలకడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతులు అంటే చులకన భావం ఉందన్నారు.రైతుకు పెట్టుబడి సాయం చేయకపోగా కనీస గిట్టుబాటు ధరను కూడా కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.నెల్లూరు జిల్లా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యధికంగా సాగు చేసిన పొగాకు రైతులను నిట్ట నిలువునా ముంచేసే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలు,చర్యలు ఉన్నాయన్నారు.అధిక పెట్టుబడులు, భారమైన కౌలు రేట్లు,బ్యారనీ బాడుగలు రైతు నడ్డి విరుస్తున్నందున రైతులకు మద్దతుగా ప్రభుత్వం ఆదుకునే చర్యలు ఏమాత్రం చేపట్టడం లేదన్నారు.ఈ సీజన్లో పొగాకు పంట పరిమితిని పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుంది తప్ప సరైన వేలం ధరను రైతుకు కల్పించలేక పోతుంది అని విమర్శించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి రైతు సంక్షేమ విధానాల వలన ఇదే సీజన్లో అత్యధిక రేటు పలికింది రైతులకు మంచి లాభాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం పొగాకు మార్కెట్లో పలుకుతున్న ధరల వల్ల ఈ ఏడాది బ్యారెన్ కు రెండు నుంచి మూడు లక్షల వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని రోజురోజుకు రేట్లు పతనమవుతున్నందున తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకొని పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు సంస్థలతో పాటు ప్రభుత్వ సహకార సంస్థ కూడా వేలంపాటలో పాల్గొని రైతులకు మేలు చేసే విధంగా ధరలు స్థిరీకరించాలని వేలం అధికారికి వినతి పత్రం ఇచ్చి కోరారు.మార్కెట్లో ధరలు వచ్చేవరకు సరుకును కోల్డ్ స్టోరేజీలలో భద్ర పరుచుకునేందుకు అనుగుణంగా రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజీలను ఈ ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పొగాకు రైతుల పరిస్థితికి అనుగుణంగా వ్యవహరించాలి లేకపోతే అనేక మంది రైతుల బతుకులు ఆర్థికంగా చితికి పోయి రోడ్డుపాలు అవుతాయని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు .వేలం పాట ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్ ఒకే రేటు పై నడుస్తుందని బయర్లు ఏమాత్రమూ ధరలు పెంచడం లేదని సిండికేట్ గా ఏర్పడి రైతులను దెబ్బతీస్తున్నారని అనేకమంది రైతులు నా వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు అండగా వైఎస్ఆర్సిపి నిలబడుతుందన్నారు. మద్దతు ధర సాధించే వరకు వారితో కలిసి పోరాడుతుందన్నారు. అవసరమైతే రైతులకు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రివర్యులు, ప్రతిపక్ష నాయకులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని పిలిపించి రైతు సోదరులకు అండగా ఆందోళన చేపడతామని తెలిపారు. వేలం అధికారితో మాట్లాడుతూ సమస్య తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారం చూపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం అధ్యక్షులు నల్లమోతు చంద్రమౌళి, రైతు విభాగం మండల అధ్యక్షులు గోగినేని రామాంజనేయులు, జిల్లా జనరల్ సెక్రటరీ తోకల కొండయ్య, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, జిల్లా సెక్రటరీ చీమల వెంకటరాజా, బూత్ కమిటీ రాష్ట్ర నాయకులు గణేశం గంగిరెడ్డి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కప్ బేస్‌బాల్ పోటీలకు జిల్లా వాసి హేమలత ఎంపిక


ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



జిల్లాలోని ఓ కుగ్రామానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. నెల్లూరు రూర ల్ మండలం, అల్లీపురం గ్రామానికి చెందిన పల్లికొండ హేమలత టీం అంతర్జాతీయ స్థాయిలో జరిగిన బేస్బాల్ పోటీల్లో అద్భుతంగా రాణించడంతో ఈ గౌరవం, గుర్తింపు దక్కింది. అంతేకాకుండా తొలిసారి ప్రపంచ కప్ పోటీలకు భారత మహిళా బేస్బాల్ టీం అర్హత సాధించడం గర్వించ దగ్గ విషయం. వివరాల్లోకి వెళితే...థాయ్ ల్యాండ్, బ్యాంకాక్ లలో ఏప్రిల్ 23వ తేదీ నుంచి 30 వరకు అంతర్జాతీయ బేస్బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో భారత బేస్బాల్ హేమలత టీం రెండవ స్థానాన్ని కైవసం చేసుకొని సిల్వర్ మెడల్ సాధించింది. అంతర్జా తీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలలో అద్భు తంగా రాణించడంతో మొట్టమొదటి సారి వరల్డ్ కప్ పో టీలకు భారత్ బేస్బాల్ మహిళా జట్టు అర్హత సాధించి యావద్భారత దేశానికే గర్వకారణంగా నిలిచింది. ఈ మేరకు అక్టోబర్‌లో చైనా దేశంలో జరగనున్న వరల్డ్ కప్ టోర్నమెంట్స్ లో భారత్ బేస్బాల్ మహిళా జట్టు పా ల్గొననుంది. అల్లీపురం గ్రామానికి చెందిన పల్లికొండ ల క్ష్మి, మల్లిఖార్జున్ దంపతుల కుమార్తె హేమలత.ఈ క్రీడా కుసుమం పాఠశాల వయస్సులోనే బేస్బాల్ ఆటపై మక్కువ చూపింది. బేస్బాల్ క్రీడలో తమ కుమార్తె హేమలతకు ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు లక్ష్మి, మ ల్లికార్జున్‌లు తమ స్థాయికిమించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా హే మలత బేస్బాల్ ఆటలో ఎక్కుసేపు సాధన చేస్తూ జిల్లా, రా ష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటింది. ఈ మేరకు 37వ సీనియర్ జాతీయ బేస్‌బాల్ చాంపియన్ షిప్ అ కాల్ కాలేజ్ కౌన్సిల్ శ్రీ మస్తువానా సబిబ్, సెమ్ సంగ్రూ ర్ ఈ టోర్న మెంట్ లో హేమలత పాల్గొంది. ఏదేమైనా ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎ దురైనా కుంగిపోకుండా మొక్కవోని ధైర్యంతో అటు జీవి తంలో, ఇటు బేస్బాల్ పోటలలో పోరాడి ప్రపంచ స్థాయికి ఎదిగిన పల్లికొండ హేమలతపై క్రీడాలోకం ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

సమస్యల పరిష్కార బాధ్యత సూపరింటెండెంట్లదే..

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న కమిషనర్

నగరపాలక సంస్థకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందుతున్న సమస్యల పరిష్కార బాధ్యతలను సంబంధిత విభాగాల సూపరింటెండెంట్లు పూర్తిస్థాయిలో చేపట్టి, సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల సూపరింటెండెంట్ లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో వివిధ పౌర సేవలకు గాను నిర్దేశించిన సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ ను ప్రణాళిక బద్ధంగా నిర్వహించేలా ఉన్నత స్థాయి విభాగం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. డిస్పాచ్ విభాగం ద్వారా వివిధ సేవలకు గాను అందుకున్న దరఖాస్తులను సంబంధిత విభాగాలకు నిర్దేశించిన సమయానికి బదిలీచేయాలని, ప్రతీ విభాగంలోనూ సర్వీస్ లెవెల్ అగ్రిమెంటును తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన కోర్టు కేసులు కాలాతీతం కాకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు లీగల్ సెల్ విభాగం వారు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఏ.పీ.ఎఫ్.ఆర్.ఎస్ యాప్ ద్వారా ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా నమోదు చేయించాలని, ముఖ ఆధారిత హాజరు ఆధారంగానే సిబ్బంది జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగర పాలక సంస్థ మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం

ఎరుపెక్కిన రూరల్ నియోజకవర్గం

ప్రజాశక్తి -నెల్లూరు

రూరల్ పరిధిలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి, ప్రతి వార్డులోనూ సిపిఐఎం, సిఐటియు, ప్రజా సంఘాల జెండాలు ఎగరవేశారు. విఎంఆర్ నగర్ లో జరిగిన మేడే కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ చారిత్రాత్మక అంతర్జాతీయ కార్మిక పోరాట దినోత్సవం (మే డే కార్యక్రమాన్ని) యావత్తు ప్రపంచ నిర్వహించుకుంటుందన్నారు. అమరుల త్యాగాలతో మే దినోత్సవం, 8 గంటల పని హక్కును సాధించుకోవటంతో పాటు, పెట్టుబడిదారీ దోపిడికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో ప్రపంచ కార్మిక వర్గాన్ని ఏకతాటి పైకి తీసుకొచ్చిందన్నారు. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అనే సమర నినాదాన్ని ఆచరణలో నిజం చెయ్యటంలో మహత్తరమైన శక్తిని ప్రదర్శించిన రోజు మేడా అన్నారు. రూరల్ కార్యదర్శికొండా ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ అజీజ్ పాల్గొని మాట్లాడుతూ సంపద సృష్టి కర్తలు కార్మికులు అని అన్నారు. ఏ సి మార్కెట్ , కోనేరు మార్కెట్ లో మేడే కార్యక్రమం లో సిఐటియు రూరల్ కార్యదర్శి కె పెంచల నరసయ్య పాల్గొని మాట్లాడారు. 17 వ డివిజన్ పరిధిలో జరిగిన కార్యక్రమం లో సిపిఐఎం నెల్లూరు రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కట్టా సతీష్ పాల్గొని మాట్లాడారు. కొత్తూరు ప్రాంతం లో జరిగిన మేడే వేడుకల లో సిఐటియు నాయకులు బలరాం పాల్గొని మాట్లాడారు. జెండాను నేలపాటి రఘురామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూరల్ కమిటీ సభ్యులు షాహీన బేగం, దేవతాటి సంపత్ కుమార్,సయ్యద్ రఫీ అహమద్ ,షేక్ శంషాద్ ,బి నాగేశ్వర రావు ,ఈ ఎస్ బాబు ,క్రాంతి కుమార్,షేక్ రుబియా ,క్రాంతి కుమారు , జమ్ముల తిరిపాలు , ఎం సుధాకర్ , షేక్ ఖలీల్ ,కండె కోటేశ్వరరావు, నందిపాటి మాలకొండయ్య , ఆర్ వి రావు ,ఒంగోలు సుధీర్,పోతురాజు శ్రీనివాసులు,శాఖ కార్యదర్శులు , పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ సానుభూతిపరులు,కార్మికులు పాల్గొన్నారు, అనేక చోట్ల మజ్జిగ చలివేంద్రలను నిర్వహించారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని వాడవాడల్లో మే డే దినోత్సవం వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. సిపిఎం సీనియర్ నాయకులు వేగూరు వెంకయ్య ఆధ్వ ర్యంలో మల్లికార్జున పురం, ఇస్కపాలెం, కృష్ణారెడ్డిపా లెం, పేడూరు, నరుకూరు తదితర గ్రామ శాఖల పర్యవే క్షణలో కార్మిక దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవం గా జరిగాయి. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. మే డే వేడుకలను పురస్కరిం చుకొని మజ్జిగ చ లివేంద్రలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, మారుబోయిన రాజా, బండి శౌరి, మారుబోయిన వెంకట శేషయ్య, మోచర్ల రాధయ్య, ఇనమాల కొం డయ్య, పచ్చ మధు, కాల్తిరెడ్డి రమణ మ్మ, ఆ టో కార్మికులు, ఆ శా వర్కర్లు అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు గుడ్స్ షెడ్ ముఠా వర్క ర్స్ యూనియన్ కార్మికులు, ప్రజలు, సాను భూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.



బొల్లినేని సెంటర్‌లో



బొల్లినేని సెంటర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న



బొల్లినేని వైద్యశాల ఎదురుగా



31వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో



20,21 డివిజన్ ప్రాంతంలో



30వ డివిజన్‌లో,



29వ డివిజన్‌లో,



క్రాంతినగర్ సెంటర్‌లో,



13వ డివిజన్‌లో



12వ డివిజన్‌లో



టిపి గూడపులోని పలు గ్రామాల్లో మేడే వేడుకలు

పలుచోట్ల దాచూరి రామిరెడ్డికి నివాళులు



ఉదయగిరిలో..


కోవూరులో..


కావలిలో..

ప్రజాశక్తి - ఉదయగిరి

ఉపాధ్యాయ ఉద్యమ కెరటం కీర్తిశేషులు దాచురి రామిరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా ఉదయగిరిలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో దాచురి రామిరెడ్డి చిరస్మరణీయులని ఉపాధ్యాయులకు మాస్టర్ స్కేల్స్ సాధించడంలో కుటుంబ సంక్షేమ పథకం రూపకల్పనలో జాతీయస్థాయిలో ఎస్‌టిఎఫ్ఐ నిర్మాణంలో శాసనమండలి సభ్యులుగా ఉపాధ్యాయులకు ఆయన చేసిన సేవలు మరువలేని అని ఆయన పాత్ర ఎనలేనిదని కీర్తించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు హనీఫ్, షేక్ గాజుల మున్న, షేక్.ఖాదర్ బాషా, గాజులపల్లి సుబ్బారెడ్డి, గాజులపల్లి రామిరెడ్డి, నల్లబోతుల రామకృష్ణ, షేక్ దస్తగిరి అహ్మద్, ఉదయ్, మీనిగ ఫణి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోవూరు : కోవూరులోని సీతాపోలయ్య భవన్‌లో యుటిఎఫ్ కోవూరు ప్రాంతీయ మండలాల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు భారతి, షేక్ ఖాజావలీ, పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలీ మాట్లాడుతూ దాచూరు రామిరెడ్డి ఆదర్శప్రాయుడని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తను 16 సంవత్సరాల సర్వీసును వదులుకొని యుటిఎఫ్ లక్ష్యం కోసం పని చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలోనే విద్య ఉండాలని, కామన్ స్కూల్ సిస్టమ్ ఉండాలని, ఉపాధ్యాయుల అంకితభావంతో పనిచేయాలని ఎల్లప్పుడూ చెప్పేవారిని గుర్తు చేసుకున్నారు. ఆయన నెల్లూరు జిల్లాలో పనిచేసేటప్పుడు ఉపాధ్యాయుడుగానే కాకుండా గ్రామాల్లో పేదల కోసం వైద్యుడిగా చికిత్స కూడా అందించేవాడని తెలియజేశారు. కార్యక్రమంలో కోవూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, విడవలూరు మండలం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, అల్లూరు మండల బాధ్యులు బి వెంకయ్య చిన్నసుబ్బయ్య, జయ ప్రకాష్, బత్తల శ్రీనివాసులు, మాలకొండయ్య, చేబ్రోలు శ్రీనివాసులు, తోటా శేషయ్య, రవికాంత్, రహమతుల్లా, నాగభూషణం ఉమా మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయఫెడరేషన్ (యు.టి.ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం కావలి డివిజన్‌లోని నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, కార్యదర్శిలు ఐ.హెచ్.ఎల్.ప్రసాద్, బెల్లం మాధవరావుల అధ్యక్షతన ఉపాధ్యాయ ఉద్యమంలో ఒక విప్లవజ్యోతి, ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్మాత, అఖిలభారత సంఘం సృష్టికర్త, అనేక ఉద్యమాల కుఊపిరి, సమస్యల్లో ఉన్న ఉపాధ్యాయులకుపెన్నిధి, కిందిస్థాయి నుండి కేంద్రస్థాయి వరకు ఉద్యమాన్ని నిర్మించిన మహోన్నతుడు, సంఘ నియమాలను, నిబంధనలను నూటికి నూరుశాతం పాటిస్తూ క్రమశిక్షణతో మెలిగిన ఆదర్శజీవి, ఉపాధ్యాయ ఉద్యమంలో నాయకుడు అంటే మొట్టమొదట వినవచ్చే పేరు "దాచూరి రామిరెడ్డి" ఉపాధ్యాయులకు, విద్యా రంగానికి కష్టాలు ఎదురైనప్పుడల్లా ఉపాధ్యాయుల పక్షాన తాను, తన సంఘం ఉన్నాయంటూ ప్రభుత్వ వైఖరికి ఎదురొడ్డి నిలబడి ఉపాధ్యాయులకు మేలుచేసిన మహానాయకుడు అమరజీవి కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం వారికి సంస్మరణ సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దాచూరి క్రమశిక్షణ, దార్శనికత, ఆదర్శం, ఉద్యమ దృక్పథాన్ని, పోరాట పటిమను కొనసాగించడమే కర్తవ్యంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐ.హెచ్.ఎల్. ప్రసాద్, బెల్లం మాధవరావు, కిలారి వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి మురళీకృష్ణ, షేక్.ముజీబ్ అహ్మద్, వేణుగోపాల్, తిరుపతి స్వామి, శ్రీనివాసులు, నరసింహా రావు, తదితరులు పాల్గొన్నారు.



నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన గ్రామాల్లో ఈ వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా బోర్ మెకానిక్లు, మండల రిసోర్స్ పర్సన్ల సంబంధిత మండలాల ఎఇలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాస్ అన్నారు. కోవూరులోని ఆర్ డబ్ల్యూఎస్ డిఇ కార్యాలయంలో శుక్రవారం కోవూరు ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎఇలు, బోరు మెకానిక్లు, రిసోర్స్ పర్సన్లతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలో అయినా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. క్రమం తప్పకుండా రక్షిత నీటి పథకాలకు క్లోరినేషన్ చేయించడం, వాటర్ పైప్లకు లీకేజీలు ఉంటే వాటికి మరమ్మతులు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా ఈ వేసవిలో మంచినీరు కలుషితం కారణంగా అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా కూడా మంచినీటి పైప్‌లైన్లు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఈ వేసవికి సంబంధించిన మంచినీటి సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎఇలు చైతన్య, జగదీష్, కార్తీక్, హరికృష్ణ, ఐదు మండలాలకు సంబంధించిన బోర్ మెకానిక్లు, రిసోర్స్ పర్సన్లు ఉన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



ప్రజాశక్తి-వరికుంటపాడు : బాల్యవివాహాల చట్ట రీత్యా నేరమని బాల్యవివాహాల నివారణపై గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.తేజస్వి పేర్కొన్నారు. శుక్రవారం వరికుంటపాడు స్త్రీ శక్తి భవనంలో అంగన్వాడీలు, ఆశాలు, విఎఓలు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలకు కిషోరి వికాసం వేసవి శిక్షణపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు, ఆశాలు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానిక ఎండిఓ కార్యాలయ ఆవరణంలోని స్త్రీ శక్తి భవనములో కిషోర్ వికాస కార్యక్రమంపై సిడిపిఓ సునీత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల భవిష్యత్తు భరోసా కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. బాల్య వివాహాలు పోక్సో చట్టంపై అవగాహన బాలల హక్కులు న్యూట్రిషన్ రక్తహీనతపై గండిపాలెం ఆరోగ్య కేంద్రం హెచ్ఇ కె వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : ఇనమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయంలో శుక్రవారం కిశోరి వికాసంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు ఐసిడిఎస్ సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న కిశోర బాలికలు ఎటువంటి ఆకర్షణలకు సెల్ఫోన్ మాయలో పడవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, సూపర్వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తదితరులు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

రెవెన్యూ సిబ్బందితో సమీక్ష



ప్రజాశక్తి-దగదర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని తహశీల్దార్ పి.కృష్ణ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కగా రికార్డు డాక్యుమెంట్ ఉండి వన్‌బి లో సునవల్ నెంబర్ వారిని తండ్రుల నుంచి కొడుకులకు వారసత్వం కింద సంక్రమించిన వారిని రైతులను దగ్గర నుంచి సేకరించాలని సూచించారు. వీటిని జిల్లా ఉన్నతాధికార దృష్టికి తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ సాగు చేసుకుంటూ పట్టా ఇవ్వకుండా ఉన్న వారిని పట్టాలు మంజూరు చేసేందుకు ప్రతి ఒక్కరూ రేషన్ బియ్యం తీసుకుంటూ ఈ కెవైసి, (జిఎంఎస్ 30,) అంటే అన్ ఎన్ బుల్ ప్రభుత్వ భూమి ఇల్లు కట్టుకొని నివాసముంటున్న సదరు వ్యక్తి పట్టాలు మంజూరు కాని వారికి ప్రభుత్వము జిఒ నెంబర్ 30 విధానం చేసిందని తెలిపారు. ఈ జిఒ వల్ల ఇల్లు కట్టుకొని పట్టాలు లేకుండా ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులకు ఈ జిఒ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పట్టాల మంజూరు కోసం ఈ వారం తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలు సమర్పించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివ, సర్వేయర్, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిని కలిసిన మాలకొండారెడ్డి



ప్రజాశక్తి - కావలి : కావలి సబ్ కోర్టుకు సీనియర్ సివిల్ జడ్జిగా వచ్చిన లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గీతావాణిని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి, లీగల్ మెంబర్ వాసిరెడ్డి ఎ.సాయి ప్రసాద్ కలిసి బొకేతో అభినందనలు తెలిపారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ కావలి లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సత్వరన్యాయం కొరకు మెరుగైన న్యాయసేవలు అందించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-కావలి : కావలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కచ్చేరిమిట్ట రోడ్డు ప్రాంగణంలో చల్లని మంచి నీటి చలివేంద్రం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా రమణయ్య ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలకు ఇలాంటి చలివేంద్రాలు అవసరమని, దప్పిక కాకున్నా తరచూ మంచినీరు తీసుకుంటూ డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ సంఘం వేసవి చలివేంద్రాలు నిర్వహిస్తూ ఉందన్నారు. సహాధ్యక్షుడు పూడితేటి రవికుమార్, కార్యదర్శి జలజానాథయ్య, ట్రెజరర్ యేపూరు వెంకయ్య, కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, గూడల శ్రీనివాసరావు, మన్నేపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం కచ్చేరి మిట్ట నివాసులు శిఖరం శ్రీనివాస వరప్రసాదరావు నాల్గవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వారి సతీమణి శిఖరం.సుజాత, వారి కుమారులు సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా శివరామ సుబ్బయ్య గిరిజన కాలనీ, చెరువు కట్ట గిరిజన కాలనీ, బుడంగుంట గిరిజన కాలనీల్లోని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ శిఖరం శ్రీనివాస వర ప్రసాదరావు వర్ధంతి సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా 150 మందికి పైగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. గత నాలుగేళ్లుగా తమ సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చెస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలు శిఖరం సుజాత, వారి కుమారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

కళ్యాణ మహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని కాశీపాలెం శ్రీ భద్రావతి సమేత భావన ఋషి శ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి ఉభయకర్తలుగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మలవతు వెంకట సుధాకర్, లత దంపతులు వ్యవహరించారు. అనంతరం చెన్నైకు చెందిన కాసుల రామమూర్తి బ్రదర్స్ అన్న ప్రసాద వితరణ గావించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై కళ్యాణాన్ని తిలకించి పులకించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు మిట్టగిరి సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి నరసయ్య, చేవూరి చలమయ్య, అందగుండ సుబ్బారావు, దొనిపర్తి శ్రీహరి మల్లికార్జున, కాసుల జనార్ధన, గండికోట సుధీర్ కుమార్, కడిమి వెంకట శేషయ్య, కొన్నులగడ్డ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ వేయించాలి

ప్రజాశక్తి-కావలి : కావలి ఆర్అండ్‌బి ఇ.ఇ. కార్యాలయంలో ఇ.ఇ. రామ కృష్ణ ప్రసాద్‌ని కలిసిన జిల్లా యస్.సి.అండ్ యస్.టి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వున్న ట్రంకు రోడ్డు పై జీబ్రా లైన్లు. స్పీడ్ బ్రేకర్స్ వేయాలని ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ వుండడం వల్ల బాటసారులకు, పాఠశాల విద్యార్థులకు, వృద్ధులకు ఈ సౌకర్యం ఎంతగానో వుంటుందని, తద్వారా యాక్సిడెంట్లు తగ్గుతాయని తెలిపారు. దానిపై ఇఇ రామక్రిష్ణ, ప్రసాద్, స్పందిస్తూ దానిపై పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట, అనుమ సముద్రం అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర వికాస్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆత్మకూరు ప్రాజెక్ట్ సిడిపిఒ ఆదేశానుసారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు పి.విజయ లక్ష్మి, జి కస్తూరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్లలో వారు మాట్లాడుతూ మహిళా సాధికారత, సుశక్తి, జ్ఞానం, బాల్యవివాహాలు అరికట్టడం, లైంగిక విద్య, కౌమారక బాలబాలికల సమస్యలు, పిల్లల సంరక్షణ మొదలగు 10 అంశాల పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎఎస్‌పేటలో అంగన్‌వాడీ టీచర్లు పి.సాహెరా బేగం, కే.విజయలక్ష్మి, పి సావిత్రి అదేవిధంగా అనుమ సముద్రం నుంచి అంగన్‌వాడీ టీచర్లు సిహెచ్.రూతమ్మ, ఎల్.పద్మ, షేక్ జరింతాజ్, డి.పుష్పకళ, పంచాయతీ కార్యదర్శి షేక్.మహబూబ్ బాషా, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇ.తిరుమల, ఎఎన్ఎం షేక్.సర్తాజ్, ఆశ వాలంటీర్లు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కోవూరు : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భవతి అయిన వెంటనే ఆమె పూర్తి వివరాలను ఆన్లైన్ పోర్టల్లో తప్పక నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డను కూడా రిజిస్ట్రేషన్ చేయడమే కాకుండా వారికి ఇవ్వాల్సిన వ్యాక్సినేషన్‌ను క్రమం తప్పకుండా సక్రమంగా చేపట్టాలన్నారు. ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, కోఆర్డినేటర్ డానియల్ పలు సూచనలు చేశారు. పిహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎఎన్ఎంలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కోవూరు



కోవూరులోని జాతీయ రహదారి సాయిబాబా గుడి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి కావలి వైపు వెళ్తున్న ఓ లారీ అదే మార్గంలో మోటార్ సైకిల్పై ప్రయాణిస్తున్న కాకుమూడి వెంకటరమణయ్యను వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాలపాలైన రమణయ్య అక్కడికక్కడే మతి చెందారు. సమాచారం తెలుసుకున్న కోవూరు హెడ్ కానిస్టేబుల్ రషీద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటరమణయ్య బోర్లు వేసే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల్లూరుకు వెళ్లి తిరిగి మానేగుంటపాడుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొడవలూరు మండలం మానేగుంటపాడు గ్రామం, దళితవాడకు చెందిన కాకుమూడి వెంకటరమణయ్య బోరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడికక్కడే లారీని వదిలేసి పరారీ అయ్యాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉదయం టిఫిన్ చేసి ఇంటి నుంచి బయల్దేరిన భర్త కాసేపటికే మృతి చెందడంపై ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. ఆస్పత్రి వద్ద వారు పెట్టే రోధనలు చుట్టుపక్కల వారిని కలిచివేశాయి.



జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన 'చేజర్ల'

ప్రజాశక్తి-ఉదయగిరి

వైసిపి అధినేత మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని స్టేట్ పబ్లిసిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్ మాజీ మండల అధ్యక్షులు చేజర్ల సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం తాడేపల్లి నివాసంలో కలిసి నియోజకవర్గంలో నెలకొని ఉన్న రాజకీయా పలు అంశాలపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు ఐక్యమత్యంతో పార్టీని ముందుకు తీసుకుపోవాలని సూచించారని. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉండాలని జన్మోహన్ రెడ్డి సూచించారని తెలిపారు. 2029లో జరగనున్న ఎన్నికల్లో వైసిపి ఘనవిజయం సాధిస్తుందని మరోమారు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాబోతున్నారని చేజర్ల సుబ్బారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులను అదే సెంటర్‌లో పని చేస్తున్న హెల్పర్‌లకు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఒ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ అనంతసాగరం మండలం వెంగంపల్లి గ్రామంలో రెండు వర్కర్ పోస్టులు మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామంలో ఒక అంగన్‌వాడీ వర్కర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఖాళీ అయిన అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులు భర్తీ చేసే క్రమంలో అదే సెంటర్‌లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న హెల్పర్లకు ఇవ్వాలనే జిఒ ఉందని తెలిపారు. ఆ జిఒ ప్రకారం ఏదైనా అంగన్‌వాడీ సెంటర్‌లో వర్కర్ పోస్టు ఖాళీ అయితే అది భర్తీ చేసే క్రమంలో అదే సెంటర్‌లో పని చేస్తున్న హెల్పర్‌కు వర్కర్‌కు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉంటే వర్కర్ పోస్టు హెల్పర్‌కు ఇవ్వాలని జిఒ చెబుతుందన్నారు. ఆ జిఒను అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పోరాడి సాధించుకొన్నారని, ఆ జిఒ ప్రకారమే అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మూడు వర్కర్ పోస్టులను, అదే సెంటర్‌లలో వర్కర్‌లుగా పూర్తి అర్హతలు కలిగి ఉ న్న హెల్పర్‌లకు ఇవ్వాలన్నారు. ఆ విధంగా వర్కర్ పోస్టు భర్తీ చేయకుండా వేరే వారికి వర్కర్ పోస్టులు ఇస్తే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ నాయకులు సునీత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జెడ్‌పిటిసికి విక్రమ్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



జెడ్‌పిటిసి పందిళ్లపల్లి రాజేశ్వరమ్మను నెల్లూరులోని వారి నివాసంలో ఆత్మకూరు మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు. ఇటివల రాజేశ్వరమ్మకు కాలికి గాయమై చికిత్స పొంది నెల్లూరులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి రాజేశ్వరమ్మ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వైసిపి ఎఎస్‌పేట మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మండల వైసిపి నాయకులు ఉన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 707పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 562బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 137పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్‌బి 90ఎన్ ఎస్ 30ఆర్ఆర్ 02సిఆర్ 13కాగా అధిక బరువుతో ఉన్న 08బేళ్ళను వేలానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210సగటు ధర రూ.257.78 నమోదు కాగా వేలంలో 13మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.



ఘనంగా మే డే వేడుకలు

ప్రజాశక్తి-జలదంకి

జలదంకి మండలంలో జమ్మలపాలెం, బ్రాహ్మణక్రాక, జలదంకి గ్రామాల్లో మే డే సందర్భంగా సిపిఎం పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమ్మలపాళెం జెండా ఆవిష్కరణ అడపాల సురేష్ ఆధ్వర్యాన చేపట్టారు. కార్యక్రమంలో పులుసు కోటేశ్వరమ్మ, మర్రి మధు, శెట్టిపల్లి అయ్యన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ దేశంలో ఫాసిజం రాజ్యమేలుతోందని, ఇది పేదల అభివృద్ధికి ఆటంకమని, ప్రజల మీద నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఘాటుగా విమర్శించారు. బ్రాహ్మణక్రాక గ్రామంలో ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రి అరుణపతకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మతసామరస్యాన్ని కాపాడాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో గడ్డం విజయలక్ష్మి, పందల వెంగయ్య, దేవరకొండ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు. జలదంకి మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం సీనియర్ తాళ్లూరు మాల్యాద్రి ఎర్రజెండాను ఆవిష్కరిస్తూ బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఘాటుగా విమర్శించారు. ముందుగా సిపిఎం కార్యాలయం మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నూతనంగా నిర్మించిన స్థూపం వద్ద మతసామరస్యాన్ని కాపాడాలని, ఉగ్రవాదాన్ని, మతోన్మాదాన్ని నిర్మూలించాలని తాళ్లూరు మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రావి మాల్యాద్రి అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ మరిన్ని పోరాటాలను జరిపి ప్రజల జీవన పరిస్థితులను మెరుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గడ్డం మాల్యాద్రి, బత్తల నరసింహా, మేళంగా ఆంథోనిబాబు, అడపాల సురేష్, అయ్యన్న, బోసు ప్రసాద్, కుట్టుబోయిన మాధవ తదితరులు, ఐదు గ్రామాల కార్యకర్తలు, పంచాయతీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు.

రీ సర్వేపై సమీక్ష



ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని శ్రీరాంపురంలో రీసర్వే సెకండ్ ఫేజ్ నిర్వహిస్తుండగా స్థానిక సచివాలయంలో తహశీల్దార్ పి.కృష్ణ విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో ఎటువంటి అక్రమాలకు పాల్పడకు ండా రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చకుండా అదేవిధంగా పట్టా భూమిని ప్రభుత్వం మార్చకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివ, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి దుత్తలూరు : మండలంలోని మెయిన్ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామీణ అభివృద్ధి పథకం కింద విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా శనివారం దుత్తలూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని 33/11 కేవి విద్యుత్ ఫీడర్లకు ఉదయం 10:00 గంటల నుండి 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ వెంకటసుబ్బయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు అందరూ విద్యుత్ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.